క్లుప్తంగా

దుర్గమ్మకు ఆషాఢమాస సారె



అమ్మవారికి సారె సమర్పించి, పూజలు చేస్తున్న భక్తులు

తెర్లాం: మండలంలోని టెక్కలివలసలో ఆ గ్రామ దేవత దుర్గమ్మ తల్లికి భక్తులు ఆదివారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని ఆ గ్రామ మహిళలు తెలిపారు. గ్రామానికి చెందిన మహిళలంతా ఉదయం ఊరేగింపుగా అమ్మవారి గద్దె వద్దకు పసుపు, కుంకుమ, చీరలు, వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు, పండ్లు తీసుకుని వెళ్లి అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు



బొమ్మి శ్రీనివాసరావు

తెర్లాం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కూనాయవలసకు చెందిన బొమ్మి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.ఈయన బొబ్బిలి ఏఎంసీ చైర్మన్‌గా, కూనాయవలస సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి పదవికి తన పేరును సూచించిన ఏపీ శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. శ్రీనివాసరావుకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు



బాబానగర్‌లో మురుగుకాలువలేని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న మురుగుకాలువల నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ తెలిపారు.పట్టణంలోని వాసవీనగర్, బాబానగర్, గాయత్రీకాలనీ, శ్రీనివాసరోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. కాలువలు లేకపోవడం వల్ల వర్షాలు కురిసే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయా వార్డులకు చెందిన పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఏయే ప్రాంతాల్లో కాలువలు నిర్మించాల్సి ఉందో గుర్తించి మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు తెలియజేస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వివరించారు.

పీఆర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శ్రీరాములునాయుడు



ఎన్నిక పత్రం అందుకుంటున్న శ్రీరాములునాయుడు

రామభద్రపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రామభద్రపురం, పాచిపెంట, సాలూరు,మక్కువ మండలాలకు చెందిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. నాలుగు మండలాలకు చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగులతో పాటు జిల్లా పరిషత్ ఉద్యోగు లు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడిగా రామభద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చొక్కాపు శ్రీరాములునాయుడును సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే సాలూరు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.రమణమ్మను కార్యదర్శిగా,జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా బి.సంతోష్‌కుమార్,బి.గౌరినాయుడును ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా బి.ఆర్.కె.బి.కె నాయుడు,ట్రెజరర్‌గా ఎన్.హరికృష్ణ,ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

సాగునీరు విడుదల చేయాలి

వంగర: తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా మండలంలోని ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేయాలని సాగునీటి సంఘం డైరెక్టర్లు మరిచెర్ల గంగారావు, పాతూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు లేక, నీటితడులు అందక వరినారుమడులు ఎండిపోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీరు అందని ద్రాక్షేనా..?

- పూర్తి కాని వీఆర్‌ఎస్ అదనపు ఆయకట్టు కాలువల తవ్వకాల పనులు
- రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రైతులు

బొబ్బిలిరూరల్: మండలంలోని శివారు గ్రామాల భూములకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. గున్నతోటవలస, గొల్లపల్లి, కలవరాయి, చింతాడ, రాముడువలస, వెంకటాపురం తదితర పది గ్రామాలతో పాటు సీతానగరం మండలంలోని మరో అయిదు గ్రామాల భూములకు మక్కువ మండలంలోని శంబర గ్రామం వద్ద ఉన్న వెంగళరాయసాగర్(వీఆర్‌ఎస్) ప్రాజెక్టు నుంచి సాగునీరందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శ్రీకారం చుట్టారు. వీఆర్‌ఎస్ ప్రాజెక్టు నుంచి బొబ్బిలి, సీతానగరం మండలాల్లోని సుమారు 5వేల ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో రూ.12 కోట్లతో అదనపు ఆయకట్టు పథకానికి గొల్లపల్లిలో 2006లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. కాలువల తవ్వకాలకు భూసేకరణ ప్రారంభించారు. కాలువల నిర్మాణానికి 52.72 ఎకరాల భూమి అవసరం కాగా 2017 వరకు 31.51ఎకరాలను అధికారులు సేకరించారు. రైతుల నుంచి సేకరించిన భూముల్లో కాలువ తవ్వకాల పనులు 2013లో చేపట్టారు. కాలువ కలవరాయి నుంచి వాకాడవలస వద్దకు వచ్చేసరికి తర్వాత గ్రామాల్లో భూసేకరణ చేసేందుకు నిధులు చాలకపోవడంతో అధికారులు ఆ పనులను 2017లో నిలిపేశారు.నాటి నుంచి నేటి వరకు కాలువ పనులు పూర్తి చేసేందుకు పాలకులు కానీ, అధికారులు కానీ చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వీఆర్‌ఎస్ సాగునీటి జలాలతో తమ పొలాలు సస్యశ్యామలం అవుతాయని దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రైతాంగానికే నిరాశే మిగులుతోంది. ఇటీవల రాష్ట్ర కేబినెట్ సమావేశంలో కొన్ని సాగునీటి ప్రాజెక్టుల పునర్నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించగా అందులో వీఆర్‌ఎస్ అదనపు ఆయకట్టు పథకం లేకపోవడంతో ఇక్కడి రైతాంగానికి మరోసారి నిరాశ మిగిలింది. అదనపు ఆయకట్టు పథకం పనులు పూర్తి కావాలంటే ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలో అని శివారు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వాకాడవలస వద్ద నిలిచిపోయిన కాలువల తవ్వకాలు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో శంకుస్థాపన చేసి ఆవిష్కరించిన శిలాఫలకం

ప్రతిపాదనలు పంపించాం..

గతంలో వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ నుంచి అదనపు జలాలను బొబ్బిలి, సీతానగరంలోని పలుగ్రామాల భూములకు అందించేందుకు కాలువల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కాలువల కోసం ఇంకా కొంత మేర భూమి అవసరం ఉంది. కొత్తగా భూసేకరణ చేపట్టేందుకు రూ.22 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయితే పనులు ప్రారంభిస్తాం.

– ఎస్ సుధాకర్, ఇరిగేషన్ ఏఈ, బొబ్బిలి

రైతుల కష్టాలు కనిపించడం లేదా బాబు..?



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, ఆకష్టాలు సీఎం చంద్రబాబునాయుడుకు కనిపించడం లేదా అని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ ప్రశ్నించారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు లేక నారుమడులు ఎండిపోతున్నాయని, నియోజకవర్గంలో తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం కాలువలు ఉన్నా వాటి ద్వారా చుక్క నీరు కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కూడా అటకెక్కిస్తున్నారని, 9 గంటల పాటు విద్యుత్ ఇవ్వడం లేదన్నారు. రైతులు ఆయిల్ ఇంజిన్ల ద్వారా బావుల్లో నీటిని వరినారు మడులకు తోడుతున్నారని వివరించారు. సాగునీటి ప్రాజెక్టులు, ఆనకట్టల్లో నీరు ఉన్నా కాలువల్లోకి విడిచిపెట్టకపోవడం వెనుక బోలెడంతా ఆంతర్యం ఉందని, ఇటీవల విడుదలచేసిన ఓఅండ్‌ఎం నిధులను తూతూ మంత్రపు పనులతో కాజేసేందుకు టీడీపీ నేతలు ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. రైతులకు విత్తనాలు ఇవ్వలేదని, కనీసం అవసరానికి తగ్గట్టుగా ఎరువులు పంపిణీచేయకుండా తాత్సారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన త ర్వాత కరువు కూడా వచ్చిందని, అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టితో రైతులు పంటలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తోందని, అసలు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఆశాఖ తనకెందుకు అన్నట్టుగా ఉన్నారని విమర్శించారు.

సైనికుడికి సత్కారం



సైనికుడు అప్పారావును సత్కరిస్తున్న సాహితీ నగర్ కాలనీ వాసులు

బొబ్బిలి: ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న పట్టణంలోని సాహితీ నగర్‌కు చెందిన బీఎస్‌ఎఫ్ హెచ్‌సీ కె.అప్పారావును స్థానిక సాహితీ నగర్ కాలనీ వాసులు ఆది వారం సత్కరించారు. తమ కాలనీ వాసి ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొనడం మాకెంతో గర్వకారణంగా ఉందని అప్పారావును నిర్వాహకులు అభినందనలతో ముంచెత్తారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనచోదకులకు సూచనలు చేస్తున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్‌తోపాటు మొగిలివలస, గాయత్రికాలనీ తదితర ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనా లకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలతోపాటు వాహన చోదకులకు లైసెన్స్ కూడా ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న యానాదుల కుటుంబాల పిల్లలకు వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు ఆదివారం పెన్నులు, పుస్తకాలు, పలకలు, బలపాలు పంపిణీ చేశారు. కృష్ణదాసు ఇందిరమ్మ కాలనీలోని యానాదుల ఇళ్లకు వెళ్లి చదువుతున్న పిల్లలందరికీ వాటిని అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

బుచ్చెంపేటలో కొట్లాట



గాయాల పాలై చికిత్సపొందుతున్న వారి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ రవికిరణ్

రాజాం సిటీ: రాజాం మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పలువురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు, ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు... గ్రామంలో ముద్దాడ అప్పన్న తన స్థలంలో గోడ నిర్మాణం చేపడుతున్నారు. అయితే ఆ స్థలంలో నుంచే తమ కల్లాలకు వెళ్లేందుకు దారి ఉందని, గోడ నిర్మాణం చేపడితే కల్లాలకు వెళ్లేదెలా అని కోరాడ రాంబాబు గత కొంతకాలంగా ముద్దాడ అప్పన్నతో తగాదాలు పడుతున్నారు. అయితే ఆదివారం ఇదే విషయమై పెద్ద మనుషుల వద్ద రాజీయత్నాలు జరుగుతుండగా ఇరువర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో ముద్దాడ అప్పన్న వర్గంలో రాము, సత్యం, కావ్య, సూరిబాబులు గాయాలు పాలయ్యారు. కోరాడ రాంబాబు వర్గానికి చెందిన నమ్మి సింహాచలంతోపాటు రవీంద్ర, గోవింద, శ్రీను,శేఖర్, అప్పన్నకు గాయాలయ్యాయి. గాయాలుపాలైన వారిని గ్రామస్తులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాలికల విద్యాభివృద్ధికి చేయూత



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి, జె.సి.రాజు

రామభద్రపురం: పేద బాలికల విద్యాభివృద్ధికి బొబ్బిలికి చెందిన సామాజిక సేవా సంస్థ కారుణ్యఫౌండేషన్ తనవంతు సాయం అంది స్తోందని ఆఫౌండేషన్ చైర్మన్ జె.సి.రాజు అన్నారు. నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదివి, 9వ తరగతి విద్యా భ్యాసం కోసం వేరే పాఠశాలకు వెళుతున్న ఐదుగురు విద్యార్థినులకు జె.సి.రాజు తనసొంత నిధులు రూ.30 వేలతో సైకిళ్లను సమకూ ర్చారు.వాటిని ఆగ్రామ సర్పంచ్ నడిమింటి లక్ష్మి చేతుల మీదుగా విద్యార్థినులకు ఆదివారం అందజేశారు.ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి జె.సి.రాజు మాస్టారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.కారుణ్య ఫౌండేషన్ సంస్థ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని గ్రామానికి మంచిపేరు తీసుకురా వాలన్నారు. స్థానిక నాయకులు నడిమింటి సత్యంనాయుడు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ ప్రజాసంక్షేమంపై లేదు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వానికి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై ఉన్న శ్రద్ధ ప్రజాసంక్షేమం,అభివృద్ధిపై లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించడం హేయమైన చర్యని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ఎరువులు, విత్తనాలు లభించక రాష్ట్రంలో రైతులు అల్లాడుతున్నారన్నారు. గిట్టుబాటు ధరలేక చిత్తూరుజిల్లాలో మామిడి పంటను రోడ్డుపై పోసి నిరసన తెలిపిన రైతులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించి వేధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.ఎన్నికల్లో చంద్రబాబుతో పాటు కూటమి నేతలు సూపర్‌సిక్స్‌తో పాటు వందల బూటకపు హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండానే చేసేశామని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుండడాన్ని కూటమి నాయకులు జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల నిధులు వేరే పథకాలకు మళ్లించారని ఆరోపించిన ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ పనులకు బిల్లులు ఇంత వరకు విడుదల చేయలేదన్నారు. కేంద్రప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.1,200 కోట్లు విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ఇంకా స్థానిక సంస్థలకు అందజేయకపోవడం దారుణమని మండిపడ్డారు.పంచాయతీల్లో నిధులు లేక గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు చేయలేని దుస్థితి నెలకొందన్నారు.

జీతాలు అందక సిబ్బంది అవస్థలు

ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు అయిదు నెలలుగా జీతాలు ఇచ్చుకోలేని దౌర్భాగ్యం ఈ ప్రభుత్వానిదని ఎమ్మెల్సీ విక్రాంత్ ఎద్దేవా చేశారు. తాగునీటి పథకాల వద్ద పనిచేసే సిబ్బందికి అయిదు నెలలుగా జీతాలు అందకపోవడంతో వారంతా విధులు బహిష్కరించారని, ఫలితంగా ప్రజలకు తాగునీరందడం లేదన్నారు. అయినప్పటికీ కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరి స్తున్నారని అన్నారు. షరతులు లేకుండా తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు ప్రభుత్వం అనేక షరతులు పెట్టి లబ్ధిదారుల్లో కోత పెట్టిందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారని, ఇంత వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఇప్పటికే ఒక ఏడాది ఎగవేశారన్నారు. తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. గతంలో సెంటు భూమి ఉన్న రైతుకు కూడా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పథకం పేరిట పెట్టుబడి సాయం అందించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పదిసెంట్లు కంటే తక్కువ ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందించేది లేదని షరతులు పెట్టిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, పార్టీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, ఎంపీటీసీ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు పాడి లక్ష్నునాయుడు, కెంబూరు వెంకటేశ్వరరావు, గార రమణ, టంకాల బుచ్చెన్నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



బొబ్బిలి పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాల వేదికగా ఆదివారం జరిగింది. పరస్పరం యోగక్షేమాలు, కుటుంబ జీవితం గురించి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకుని, ఆనందంగా గడిపారు. – బొబ్బిలి

ఇది సీసీ రోడ్డే...



చిత్రంలో కనిపిస్తున్నది రాజాం మండలంలోని కంచరాం గ్రామ ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే సిమెంట్ రోడ్డు.స్థానికంగా ఉన్న కొంతమంది తమ అవసరాలకు గ్రావెల్‌ను తీసుకువచ్చి రోడ్డుపై వేసి అలాగే వదిలేశారు. దీంతో ఆమార్గంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సచివా లయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పలువురు అంటున్నారు. సమస్యను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు – రాజాం సిటీ

కబ్జాకు కాదేదీ అనర్హం..!



ఈఫొటోలోని నిర్మాణం చూడండి. ఇదేదో సొంత జిరాయితీ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు అనుకుంటే పొరబడినట్టే. రాజాం పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో జేజే ఇన్నోటెల్‌కు ఎదురుగా పట్టణ మురుగుకాలువతో పాటు మల్లమ్మచెరువుకు నీరు వెళ్లే ఓ కాలువపై టీడీపీ కార్యకర్త చేపడుతున్న అక్రమ నిర్మాణం ఇది. ముందర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా దర్జాగా చకచకా నిర్మాణ పనులు చేయించేస్తున్నాడు. అక్రమాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. – రాజాం

ఏఎస్‌ఐకి సన్మానం



ఏఎస్ఐ కొండలరావును సత్కరిస్తున్న సీఐ నారాయణరావు,తదితరులు

బాడంగి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేసి బదిలీ అయిన డి.కొండలరావును సీఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది ఆదివారం సన్మానించి వీడ్కోలు పలికారు. కొండలరావు సేవలను సీఐతో పాటు ఎస్ఐ, స్టేషన్ సిబ్బంది కొనియాడారు.

మహిళలపై దాడులు చేయడమే మీ సంస్కృతా...?

- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అచ్యుతవల్లి



మాట్లాడుతున్న అచ్యుతవల్లి

బొబ్బిలి: మహిళా ప్రజాప్రతినిధులపై దాడులు చేయించడం రెడ్ బుక్ రాజ్యాంగమా లేక కూటమి నాయకుల సంస్కృతా అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తూముల అచ్యుతవల్లి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కృష్ణా జిల్లా గుడివాడలో ఆ జిల్లాజెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రయాణిస్తున్న వాహనంపై టీడీపీ,జనసేన మూకలు దాడులు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు.ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అన్ని పథకాలను కొనసాగిస్తునే మహిళల కోసం అదనంగా పథకాలు అమలు చేస్తామని నమ్మించి చంద్రబాబునాయుడు గద్దెనెక్కారని, ఇప్పుడేమో మొహం చాటేస్తున్నారని అన్నారు. అది చాలక ఇప్పుడు మహిళలపై దాడులకు తెగబడటం దారుణమన్నారు. మహిళల సాధికారతే కూటమి లక్ష్యం అని చెప్పుకున్న నాయకులు సాధికారత మాటలు పక్కన పెట్టి తుదముట్టించడానికి తయారయ్యారా అని ఆమె ఘాటుగా స్పందించారు. పోలీసులు కూడా దాడి జరుగుతున్నంత సేపూ ఏమీ అనకుండా మూకలు వెళ్లిపోతున్నప్పుడు హంగామా చేశారే తప్ప అడ్డుకుని హెచ్చరించకపోవడం రెడ్ బుక్ రాజ్యాంగమేనని స్పష్టమవుతోందన్నారు. ఎవర్నీ విమర్శించని కుటుంబం నుంచి వచ్చిన హారికపై దాడికి పూర్తిగా కూటమి నాయకులే బాధ్యత వహించాలన్నారు. బేషరతుగా క్షమాపణలు చెప్పి దాడికి పాల్పడ్డ వారందరినీ అరెస్టు చేయాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు రోడ్లపైకి వస్తారన్నారు. హామీలిచ్చి అమలు చేయలేని ప్రభుత్వాన్ని ప్రజలు విమర్శిస్తుంటే ఫ్రస్టేషన్‌లో కూటమి నాయకులు దాడులకు దిగుతున్నారన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. హోం మంత్రిగా వంగలపూడి అనిత ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆమె ఈ కేసును ప్రత్యేకంగా తీసుకుని దర్యాప్తు జరిపించి నిందితులకు శిక్షపడేలా చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాల పండగ

బాడంగి: మండలంలోని చినభీమవరంతో పాటు పలుగ్రామాల్లో ఆదివారం దేశమ్మతల్లి పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు.చినభీమవరంలో పూజారి యామలస్వామినాయుడు ఆధ్వర్యంలో మేలతాళాలతో గ్రామస్తులు దేశమ్మతల్లి గద్దె వద్దకు చేరుకుని పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



మామిడితోటలోకి దూసుకుపోయిన లారీ

వంగర: వంగర–రాజాం రోడ్డులో ప్రమాదం ఆదివారం తృటిలో ప్రమాదం తప్పింది. వంగర నుంచి రాజాం వైపు ఊకలోడుతో వెళుతున్న లారీ కోడిశ గ్రామ కొండసమీపంలో అదుపు తప్పి మామిడితోటలోకి దూసుకువెళ్లి అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదం సంభవించిందని, ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

కంటి శస్త్రచికిత్సలకు 68 మంది ఎంపిక



వంగర: నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ జాక్సన్



రాజాం సిటీ: వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ పూజిత

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో తిరుపతికి చెందిన నవజీవన్, మండలానికి చెందిన స్పందన స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిం చారు.శిబిరంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ జాక్సన్ 130 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 68 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి, మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. స్పంద న స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ, సభ్యులు బెవర ఈశ్వరరావు, బొత్స గణపతి, శంకర్‌ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాంలో...

రాజాం సిటీ: పట్టణ పరిధి సంతమార్కెట్ ఆవరణలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరానికి చెందిన వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ పూజిత 72 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 33 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు, శిబిరం కో–ఆర్డినేటర్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.